క్లుప్తంగా

పరామర్శ..



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వాల్లే నాగేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. నాగేశ్వరరావు కుమారుడు సాయిగణేష్ మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నెల్లిమర్లలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, పైల మురళి, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మాదకద్రవ్యాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

పూసపాటిరేగ: మాదకద్రవ్యాలను నియంత్రించాలని ఎస్సై ఎ. సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరపూరితమైన విషయాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



కార్యదర్శి త్రినాథరావు దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

పూసపాటిరేగ : విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. మండలంలోని రెల్లివలస గ్రామంలో సచివాలయ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన త్రినాథరావును బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యోగాన్ని బాధ్యతగా చేసిన వారు ప్రజల మన్ననలు పొందుతారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, సర్పంచ్ ఇజ్జరోతు అప్పలరాజు, మాజీ ఎంపీపీ మహంతి చిన్నంనాయుడు, మహంతి శంకరరావు, మహంతి శ్రీనివాసరావు, ఇజ్జరోతు ఈశ్వరరావు, వెంపడాపు సూర్యనారాయణ, గొర్లె రమణ, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఓపీ చీటీలు



ఓపీ విభాగాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్ : రోగులకు త్వరితగతిన ఓపీ చీటీలు ఇవ్వాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఓపీ చీటీలు ఇచ్చే విభాగాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆస్పత్రికి ఓపీ విభాగానికి వచ్చే వారు అభా (ఆయుష్మాన్ భారత్) యాప్ డౌన్‌లోడ్ చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ యాప్ ద్వారా నిరీక్షించకుండా ఓపీ చీటీలు తీసుకోవచ్చని చెప్పారు. అనంతరం పలు ఓపీ విభాగాలను పరిశీలించారు. నిర్దేశించిన ప్రకారం ప్రతి వైద్యుడు ఓపీ విభాగాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు అందుబాటులో ఉండాలన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి సకాలంలో చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ ఎస్. సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో తనిఖీలు



రైతుబజార్‌లో దుకాణాన్ని పరిశీలిస్తున్న రవికిరణ్

శృంగవరపుకోట: పట్టణంలోని రైతుబజార్‌లో డీఏటీ,ఎంఓ బి.రవికిరణ్ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతు బజార్ రికార్డులను, దుకాణాలు, విక్రయిస్తు న్న సరుకులు, కూరగాయలను పరిశీలించారు. ధరలపై దుకాణాల నిర్వాహకులను ఆరా తీశారు. వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా దుకాణాల వద్ద ధర ల పట్టికలు ఏర్పాటు చేయాలని ఈఓ సంతోష్‌కు సూచించారు. తూకంలో, నాణ్యతలో తేడాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందితే ఉపేక్షించేది లేదని, నాణ్యమైన కూరగాయలను తక్కువ ధరకు వినియోగదారులకు ఇవ్వాలన్నదే రైతుబజార్ల లక్ష్యమని చెప్పారు.

అమ్మపాలు... బిడ్డకు అమృతం..

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు



రామచంద్రపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



గుంపాం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పూసపాటిరేగ : అమ్మపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ అధికారులు, వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ఏర్పరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళలకు గర్భం దాల్చిన ప్పటి నుంచి తల్లిపాల ఆవశ్యకత, బిడ్డ పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. లేనిపోని అపోహలతో అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు దూరం చేయరాదు. ముర్రుపాలు ఎంత వేగంగా బిడ్డకు తాగిస్తే అంత ఆరోగ్యకరం. ఈ నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకే ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఆగస్టు 1 నుంచి ఏడో తేదీ వరకు భోగాపురం సెక్టార్ పరిధిలో వారోత్సవాల నిర్వహణకు అంగన్‌వాడీ కేంద్రాల వారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. భోగాపురం సెక్టార్ పరిధిలో 210 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు , 62 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటి పరిధిలో 1071 మంది గర్భిణులు, 911 మంది బాలింతలు, ఆరు నెలల్లోపు చిన్నారులు 915 మంది, ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 5441 మంది , మూడు నుంచి ఆరు సంవత్సరాల్లోపు పిల్లలు 3129 మంది ఉన్నారు. వీరందరికీ తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, ఏసీడీపీఓలు, సీడీపీఓలు సన్నద్ధమవుతున్నారు.

ముర్రుపాలులో రోగ నిరోధక శక్తి

శిశువు జన్మించిన తొలి రోజుల్లో తల్లిపాలు చిక్కగా పసుపుగా ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ప్రొటీన్లు అధికంగా ఉండడంతో వీటిని శిశువు తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శిశువు జన్మించిన తొలి అరగంట లోపే ముర్రుపాలు తాగించడం చాలా మంచిది. ఇందులో విటమిన్ ఎ, బిలతో పాటు తగినంత ఐరన్ ఉంటాయి.

ఆరు మాసాల వరకు తల్లిపాలే ఆహారం..

బిడ్డ పుట్టాక తొలి ఆరు మాసాలు తల్లిపాలే ఆహారం. తప్పనిసరి పరిస్థితులలో మినహా వేరే ఏ పాలూ బిడ్డకు పెట్టకుండా ఉండడమే మంచిదని వైద్యులు సూచన. మొదటి రెండు నెలల్లో బిడ్డకు రెండు గంటలకోసారి పాలు పట్టాలి. రాత్రిళ్లు పాలు ఇవ్వడం వల్ల తల్లి మెదడు నుంచి ప్రొలాక్టిన్ ఎక్కువగా స్రవిస్తుంది. ఇది పాల ఉత్పత్తికి కావాల్సిన హార్మోన్. మొదటి ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు తేలికగా జీర్ణం అవుతుంది. శ్వాసకోశ, అలర్జీ , ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలకు ఎంతో రక్షణనిస్తాయి. ఆరు మాసాల తర్వాత బిడ్డకు తల్లిపాలతో పాటు వైద్యుల సూచన మేరకు ఇతర ఆహారం ఇవ్వాలి.

శిశువుతో పాటు తల్లికీ ఆరోగ్యం..



అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులకు ముందుగానే అవగాహన కల్పిస్తున్నాం. శిశువు జన్మించాక వీలైనంత త్వరగా ముర్రుపాలు పట్టాలని చెబుతున్నాం. ఇది తల్లీ,బిడ్డలిద్దరికీ శ్రేయస్కరం. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు అవసరమైన శక్తి తల్లిపాల ద్వారానే వస్తుంది. ఈ నెల 1 నుంచి 7వతేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తాం.

ఎస్తేరుణాజి, సీడీపీఓ భోగాపురం సెక్టార్

హెచ్‌ఎం తీరుపై నిరసన



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

డెంకాడ: దశాబ్దాలుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహిస్తున్న నిర్వాహకులను తొలగించి వేరే వారిని నియమించేందుకు పాఠశాల హెచ్‌ఎం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, ఈ ప్రయత్నం మానుకోవాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. భగవాన్ మహిళా గ్రూప్ సభ్యులైన రొంగలి రమణమ్మ ఆధ్వర్యంలో కొంతమంది సభ్యులు సుమారు 20 ఏళ్లుగా డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈమధ్య కాలంలో రాజకీయ కారణాలతో నిర్వాహకులపై హెచ్‌ఎం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వేరే వారిని నియమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది సరికాదని హితవు పలికారు. అధికారులు స్పందించి హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ. పది వేల వేతనం..

మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు నెలకు కనీసం రూ.10 వేల వేతనం చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. బకాయి బిల్లులు, జీతాలు వెంటనే ఇవ్వాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల: నగర పంచాయతీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా టిడ్కో ఇళ్లు 576 మంజూరైనా, ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వలేదని.. మొయిద జంక్షన్ సచివాలయం పరిధి సినిమాహాల్ వద్ద అనుమతుల్లేకుండా ఆరంతస్తుల భవనం నిర్మించారని.. మిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం ఐదెకరాలకు గాను రెండెకరాలకే పన్ను చెల్లిస్తోందని..నెల్లిమర్ల జూట్ మిల్లు యాజమాన్యం రూ. 6 కోట్ల బకాయిలు చెల్లించలేదని.. ఏడో వార్డులో కాలువ అసంపూర్తిగా ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ.. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం అన్న క్యాంటీన్ మిగులు పనులు పూర్తి చేయడానికి, జరజాపుపేట తాగునీటి పథకం మెట్ల నిర్మాణం, వీధికుక్కలకు శస్త్రచికిత్సలు చేయడానికి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, మైపాడ ప్రసాద్, ఎం. లక్ష్మి, మజ్జి నాగమణి, మొయిద శ్రీనివాసరావు, పొంద్రంకి సత్యవతి, నాయకులు లెంక అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రమౌళి

భోగాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న నిర్వహించనున్న పీఎం ఎస్ఎంసీ ఎన్నికలపై నిర్వహణపై బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈఓలు రమణమూర్తి, బి. చంద్రమౌళి పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పీఎం ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ లిస్టులను పాఠశాలల్లోని నోటీస్ బోర్డుల్లో డిస్‌ప్లే చేయాలన్నారు. ఓటర్ లిస్టులపై ఎటువంటి అభ్యంతరాలున్నా ఈ నెల 5వ తేదీన సరిచేయాలని సూచించారు. 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నిక నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి రాజకీయాలకు అవకాశం ఇవ్వకుండా నిష్పక్షపాతంగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండలంలో ఉన్న 72 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దిబ్బలపాలెంలో విష జ్వరాలు

భోగాపురం: మండలంలోని దిబ్బలపాలెం గ్రామంలో విషజ్వరాలు ప్రబలాయి. గ్రామానికి చెందిన పలువురు మంచంపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు జ్వరాలు ప్రబలాయని గ్రామస్తులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 104 సిబ్బంది గ్రామానికి వచ్చి వైద్యశిబిరాలు నిర్వహించేవారని, ఇప్పుడా పరిస్థితి లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించాలని గ్రామానికి చెందిన నీలాపు అప్పయ్యమ్మ, తదితరులు కోరారు.

కవాతులో పాల్గొనేందుకు ఎంపికలు

విజయనగరం టౌన్: పూల్‌బాగ్‌లో ఉన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ కవాతులో పాల్గొనేందుకు బుధవారం ఎంపికలు నిర్వహించారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న అన్ని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో గైడ్ కెప్టెన్లకు ఒకరోజు పునశ్చరణ కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిన్నంనాయుడు, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్ : పట్టణంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఈఈ పూడి హరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటితడి సబ్ స్టేషన్‌లోగల 11 కేవీ సీఎంఆర్ ఫీడర్ మీద పాత లైన్లు మారుస్తున్న నేపథ్యంలో వీటీ అగ్రహారం, బీసీ కాలనీ, సంతోష్‌నగర్, గణేష్‌నగర్, వై జంక్షన్, ప్రసాద్‌నగర్, మజ్జిపేట, ప్రియానగర్ ప్రాంతాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీతాలు ఇప్పించలేరా..?



సీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

నెల్లిమర్ల: ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్, తదితర కాంట్రాక్ట్ వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న హాస్పిటల్స్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్, అధికారులు కాంట్రాక్టర్ల చేత జీతాలు ఎందుకు ఇప్పించలేకపోతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రశ్నించారు. ఈ మేరకు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో నెల్లిమర్ల సీహెచ్‌సీ వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పెద్దలు స్పందించి జీతాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నెల్లిమర్ల నాయకుడు మొయిద పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

భయం.. భయంగా పాఠశాలకు...



ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల మధ్య నుంచి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులు భయపడుతున్నారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 700 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 100 విద్యార్థినులు హస్టల్‌లోనే ఉంటూ చదువుకుంటున్నారు. మిగిలిన విద్యార్థులందరూ మండలంలోని ఇతర ప్రాంతాల నుంచి ఆటోల్లో వచ్చి జాతీయ రహదారి వద్ద దిగి నడుచుకుని పాఠశాలకు వెళ్తుంటారు. పాఠశాలకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో విషసర్పాలు వచ్చే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఈ విషయమై ఎంఈఓ రమణమూర్తి వద్ద ప్రస్తావించగా.. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఏదిఏమైనా విషయాన్ని ఎంపీడీఓ చంద్రకళ దృష్టికి తీసుకెళ్లి ఉపాధి సిబ్బంది ద్వారా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడతామని తెలిపారు.

నేడు వార్డు పర్యటన

విజయనగరం : ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గురువారం స్థానిక మూడో డివిజన్‌లో వార్డు పర్యటన చేపట్టనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు కార్పొరేషన్ అధికారులు పాల్గొంటారని, స్థానిక సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

సముద్రతీర ప్రాంతాల్లో నల్ల ఇసుక దందా



ఎర్రముసలయ్యపాలెంలో సీసీ రోడ్డు పక్కన్న ఉన్న సముద్రపు నల్ల ఇసుక

భోగాపురం: మండలంలోని ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం, ఎర్ర ముసలయ్యపాలెం, తూడెం, సముద్రతీర ప్రాంతాల్లో సముద్రపు నల్ల ఇసుక తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ ఇసుకలో విలువైన ఇలిమినైట్, రుటైల్, జిర్కాన్, గార్నెట్, కంప్యూటర్‌తో పాటు అణుబాంబు తయారీకి కావాల్సిన మూలకాలు ఉంటాయని అధికారులు గతంలో ప్రకటించారు. ఇదే అదునుగా కొంతమంది దళారులు మత్స్యకార గ్రామాల్లోని కొంతమందితో డీల్ కుదుర్చుకుని అర్ధరాత్రి వేళల్లో లారీలతో నల్ల ఇసుకను తరలించేస్తున్నారు. మార్గమధ్యలో వాహనాలు మొరాయించడంతో అక్రమ రవాణా బయటపడిందని స్థానికులు చెబుతున్నారు. ఎర్రముసలయ్యపాలెం గ్రామంలో సీసీ రోడ్డు పక్కనే ఈ నెల 29న నల్ల ఇసుక కుప్పలు బయటపడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు



అన్న క్యాంటీన్ ఏర్పాట్ల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ఆగస్టు 15న ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు తెలిపారు. అన్న క్యాంటీన్ల ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నద్ధమైన అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. వీటిని ఆగస్టు 15న ప్రారంభించనున్నట్లు చెప్పారు. నగరంలోని రెండు చోట్ల అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో ఒకటి, కార్పొరేషన్ కార్యాలయ సమీపంలో మరొకటి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.